
## కాంగ్రెస్ తీరుతోనే ఆత్మబలిదానాలు

హస్తం పార్టీ పదేండ్లపాటు కాలయాపన చేయడంతో కొందరు నిరుద్యోగులు, యువత, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పదేండ్ల కాలంలో శ్రీకాంతాచారి, కొండేటి వేణుగోపాల్‌రెడ్డితోపాటు వందలాది మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. విద్యార్థులు, యువత ఉరి పెట్టుకుని బలిదానం చేశారు. వందలాది తల్లులకు కడుపుకోత మిగిల్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 67 మంది బలిదానాలకు కాంగ్రెస్ కారణమైంది. కానీ.. చిదంబరం మాత్రం ఉద్యమాలంటే కొందరు పోతారంటూ అమరులను అవమానించేలా మాట్లాడారు. బలిదానాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించదన్నారు. 2014 తరువాత తెలంగాణ ప్రాంతంలో వివిధ కారణాలతో చేసుకున్న ఆత్మహత్యలకు, నాటి ఉద్యమ సమయంలో జరిగిన బలిదానాలకు పోలిక పెడుతూ రాష్ట్రంలో చోటుచేసుకున్న బలవన్మరణాలకు కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహిస్తదా? అని నోటికొచ్చినట్లు మాట్లాడారు. దీనిపై అమరుల కుటుంబ సభ్యులు ఫైర్ అవుతున్నారు. పదేండ్ల తర్వాత అమరులు గుర్తుకొచ్చారా? అంటూ కడిగిపారేస్తున్నారు. ఇప్పుడు ఓట్ల కోసం కాకమ్మ కబుర్లు చెబుతున్నారని మండిపడుతున్నారు. కాగా, గతంలోనూ చిదంబరం తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసి చూపిన విషయం తెలిసిందే.




**తెలంగాణ అమరులను అగౌరవపరిచిన చిదంబరం**

## అప్పుడే తెలంగాణ రాష్ట్రం ఇస్తే మా నాన్న బతికేటోడు



మాది దామరచర్ల మండలంలోని నర్సాపురం. మా నాన్న కోక్య నాటి తెలంగాణ ఉద్యమ సమయంలో మండలంలో జరుగుతున్న అనేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. నాడు చిదంబరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పడంతో సంబురాలు జరుపుకొన్నాడు. కానీ.. ఆ ప్రకటన ఆగిపోవడంతో ఎంతో కుంగిపోయాడు. తిరిగి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. రోజూ టీవీ చూస్తూ ఆందోళన చెందేవాడు. తెలంగాణ ఉద్యమంపై నాటి సమైక్య నాయకులు, పాలకులు చేస్తున్న కుట్రలపై కుంగిపోయేవాడు. 2010 జనవరి 21న సమైక్య పాలకులు తెలంగాణపై చేస్తున్న కుట్రలను, ఉద్యమాన్ని బలహీన పర్చేందుకు చేస్తున్న కార్యక్రమాలను టీవీలో చూసి ఇక తెలంగాణ రాదని నిర్ణయించుకొని కోపంతో టీవీని పగులకొట్టాడు. బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనాడు కాంగ్రెస్ పాలకులు డిసెంబర్ 9న చేసిన ప్రకటనకు కట్టుబడి తెలంగాణ ఇస్తే మా నాన్న బతికి ఉండేవాడు. మా తండ్రి చావుకు వారే కారకులు. అప్పుడు చేసిన తప్పుకు ఇప్పుడు సారీ చెప్పడంతో చనిపోయిన మా నాన్న తిరిగి వస్తాడా? దీనికి వారే సమాధానం చెప్పాలి.

**– మానోతు ప్రసాద్, నర్సాపురం, దామరచర్ల మండలం**

# 'సారీ'తో సరి

**పదేండ్ల తర్వాత ఎన్నికల్లో ఓట్ల కోసం చిల్లర మాటలు**

**ఉద్యమాలంటే కొందరు పోతారట.. కేంద్రానిది బాధ్యత కాదట**

**కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై అమరుల కుటుంబ సభ్యుల ఆగ్రహం**

**నాడు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కాలయాపన చేసిందే కాంగ్రెస్..**

**బలిదానాలతోనైనా రాష్ట్రం వస్తుందని వందల మంది ఆత్మార్పణం**

**ఎందరో తల్లులకు కడుపుకోత మిగిల్చిన కాంగ్రెస్**

**నాడు హస్తం పార్టీ తీరుతోనే యువత, విద్యార్థుల ఆత్మ బలిదానాలు**

తెలంగాణ పోరాటాన్ని తలుచుకుంటే ఉద్యమ స్ఫూర్తి ప్రజ్వరిల్లుతుంది. చిన్న పిల్లల నుంచి ముసలోళ్ల వరకు తెలంగాణ జెండా చేతబట్టి ఉద్యమంలో కదం తొక్కారు. తెలంగాణే శ్వాస, ఆశగా ముందుకు సాగారు. ఆనాటి కనికరం లేని కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా వందల మంది ఆత్మ బలిదానాలకు పాల్పడ్డారు. అలాంటి అమరుల త్యాగాన్ని కాంగ్రెస్ నేత చిదంబరం చిన్నదిగా కొట్టిపారేశారు. ఏదో మొక్కుబడిగా సారీతో సరిపెట్టారు. దీనిపై అమరుల కుటుంబాలు భగ్గుమంటున్నాయి. అమరులను అగౌరవపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

– సూర్యాపేట, నవంబర్ 18
(నమస్తే తెలంగాణ)

### పదేండ్లు నాన్చిన కాంగ్రెస్..

తెలంగాణ కోసం యావత్ తెలంగాణ ఒక్కటై ఉద్యమించింది. కాంగ్రెస్ పార్టీ సైతం తెలంగాణ ఏర్పాటు చేస్తామని 2004లో ప్రకటించింది. కానీ.. ఓట్లు దండుకున్నాక ఆ ముచ్చటే పట్టించుకోలేదు. 2009లో కేసీఆర్ దీక్ష తర్వాత నాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అప్పుడే కాంగ్రెస్ ఇచ్చినట్లే ఇచ్చి.. పెండింగ్‌లో పెట్టింది. ఆంధ్రా నేతల లాబీయింగ్‌కు తలొగ్గి తెలంగాణకు మరోసారి అన్యాయం చేసింది. ఓ దశలో తెలంగాణ అవసరమా? అన్న విధంగా వ్యవహరించింది. సుమారు పదేండ్లపాటు తెలంగాణ ఏర్పాటు చేయకుండా నాన్చింది. రాష్ట్ర ఏర్పాటుకు వివిధ కమిటీలు, సంప్రదింపులు, సలహాలు, సూచనల పేరుతో కాలయాపన చేసింది.

### నాడు ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం

నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. సబ్బండ వర్గాలు ఏకమై ఉద్యమించాయి. ధూంధాం ఆటపాటలు, వంటావార్పులు, రోడ్లపై నిరసనలు, రాస్తారోకోలు, అడ్డగింతలు, సభలు, సమావేశాలు ఇలా ఒక్కటి కాదు.. ప్రపంచమే నివ్వెరపోయేలా తెలంగాణ పోరాట స్ఫూర్తి నిలిచింది. నాడు తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా ఉద్యమకారులు ముందుకు నడిచారు. ఆత్మబలిదానాలు చూసి తెలంగాణవాదులంతా చలించిపోయారు. నాడు అమరుల అంతిమ యాత్రలు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. అంతిమ యాత్రలకు ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారంటే అమరుల త్యాగాలను అర్థం చేసుకోవచ్చు.

## మా కొడుకు చావుకు కాంగ్రెసోళ్ల తీరే కారణం

మాది మధ్య తరగతి కుటుంబం. నా కొడుకు గిరిబాబు తెలివైనోడు. చిన్నప్పటి నుంచి మంచిగా చదువుకునేటోడు. పది పాసైన తరువాత పాలిటెక్నిక్‌లో సీటు రావడంతో చదువుకుంటా అమ్మా అంటే వరంగల్‌కు పంపినం. అప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉన్నది. 60 ఏండ్లుగా తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ఉద్యోగాలు, నీళ్లు, నిధులు కావాలని చదువుకుంటున్న యువకులు రోడ్లమీదికి వచ్చి ఉద్యమాలు చేశారు. అప్పుడు తెలంగాణ రాష్ట్రం ఇస్తామని కేంద్ర హోం మంత్రి చిదంబరం ప్రకటించిండు. తరువాత మూడు, నాలుగు రోజులకే మాట మార్చిండు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామని ప్రకటించడంతోపాటు శ్రీకృష్ణ కమిటీ వేయడంతో హైదరాబాద్‌లో శ్రీకాంతాచారి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మ బలిదానం చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వకుండా సీమాంధ్రోళ్లు అడ్డుపడుతున్నారని చెప్పి నా కొడుకు కూడా వరంగల్ పాలిటెక్నిక్ కాలేజీలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని జై తెలంగాణ అంటూ ఆత్మబలిదానం చేసుకుండు. నా కొడుకు ఆత్మబలిదానం చేసుకోవడానికి కాంగ్రెస్ పాలకులు, చిదంబరం ప్రకటనే కారణం. అయ్యాల చేసిందంత చేసి ఇప్పుడు మళ్లీ హైదరాబాద్‌కు వచ్చి సారీ అంటే సరిపోతదా? ఇంత మంది పిల్లలు చనిపోవడానికి చిదంబరం ప్రకటనే కారణం. నా లాంటి తల్లుల ఉసురు చిదంబరానికి, కాంగ్రెస్ పార్టీకి తప్పక తాకుతది.



**– పిల్లి రాములు, సైదమ్మ, ముకుందాపురం, నిడమనూరు మండలం**

## కాంగ్రెసోళ్లు మాట మార్చకపోతే నా కొడుకు సచ్చేటోడు కాదు



కాంగ్రెసోళ్లు మొదట తెలంగాణ ఇస్తా అన్నరంట. ఆ తర్వాత ఇవ్వను అన్నరంట. అదేమో నాకు తెలుస్తలేదు గానీ.. నా కొడుకు శంకర్ మాత్రం ఎప్పుడు గదే మనాది బెట్టుకొని బువ్వ గూడా సరిగ్గ తినకపోయేది. పొద్దున లేస్తే తెలంగాణ అనే నా కొడుకు చివరకు దాని కోసమే సస్తాడనుకోలేదయ్య. తెలంగాణ వస్తే ఏంది.. రాకుంటే మనకెందుకురా నువ్వు సదువుకో అంటే తెలంగాణొస్తే నాకు, తమ్ముడికి ఉజ్జోగం వస్దదని అంటోడయ్యా. ఎంత జెప్పినా ఇనకుండా ఎక్కడ తెలంగాణ మీటింగైతే అక్కడ బోయేటోడు. బువ్వ గూడ సరిగ్గా తినకపోయేటోడు. అయ్యాల ఎప్పట్లాగానే నేను పనికి పోయి వచ్చిన. తెలంగాణ మీటింగ్ ఐద్రాబాద్‌లో ఉంది ఎల్తా అని పొద్దుగాల్నే చెప్పి పోయ్యొచ్చిండు. కాసేపటికి జూసేసరికి ఆదరా బాదరా బయటి నుంచి వచ్చి ఇంట్లోకెల్లి గ్యాస్ నూనె నెత్తిన బోసుకొని ఇంట్ల నుంచి బజార్లకు గబగబా కాలుకుంటా ఉరికిండు. అయ్యో అయ్యో అని మొత్తుకున్నం. అసలెందుకు బోసుకుండో, ఏం బోసుకుండో మాకు దెల్వక ఓ కొడుకో ఓ కొడుకో అని నేను, మా ఇంటాయిన ఉరికురికి అడుగుతుంటే.. తెలంగాణ ఇంగరాదు అందుకే సస్తున్న అని మొత్తుకుంట చెప్తుంటె మేమిన్నం. మా పక్కింటోల్లు మంటలార్పి గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకెల్తే నల్లగొండలో ఒక రోజు, ఆ తర్వాత ఐద్రాబాద్‌కు తీసుకెళ్లినం. ఉస్మానియా దవాఖాన్ల రెండు రోజులుండి నాలుగో నాడు పానం పోయింది. కని పెంచిన 20ఏండ్ల కొడుకు ఒక్కసారి కండ్ల ముందటే కుప్పగూలే సరికె నేను మొండి మొద్దులాగ ఉన్న గానీ.. మా ముసలాయిన తట్టుకోలేక పదకొండు నెల్లు నవిసి ఆయన కూడా సచ్చిపోయిండు. మొదట కొడుకు, ఆ తర్వాత మా ఆయన ఏడాది కాలంలో ఇద్దరు సచ్చిపోయే సరికి మనుషులం కాలేదు మేమింటిల్లాదులం. ఆ తర్వాత మమ్మల్ని ఎవరు కూడా పట్టించుకోలేదు. తెలంగాణ గవర్నమెంటు వచ్చిన తర్వాత కేసీఆర్ పుణ్యాన నా చిన్న కొడుకు శ్రవణ్‌కు ఉద్యోగం, నాకు పది లక్షల రూపాయలు ఇచ్చిండ్రు. పది లక్షల్లో పెద్ద కొడుకు గిరి, రెండో కొడుకు గోపికి చెరో లచ్చన్నర ఇచ్చి ఉన్న అప్పులు తీర్చి నా బిడ్డ సరిత పెండ్లి చేసిన. నా కొడుకు శంకర్ సచ్చి నా బిడ్డ పెండ్లి చేసిండు. ఆడు ఏదన్న గొప్పోడయ్యి మమ్మల్ని ఆదుకుంటడనుకుంటే సచ్చి ఆదుకుండు.

**– గద్దల యల్లమ్మ, తెలంగాణ అమరవీరుడు గద్దల శంకర్ తల్లి, గొల్లగూడెం నల్లగొండ**

## 2009లో రాష్ట్రం ఇవ్వకపోవడం వల్లే నా కూతురు ఆత్మ బలిదానం చేసుకుంది



తెలంగాణ ఉద్యమ సమయంలో నా చిన్న కూతురు ఇట్టమల్ల కవిత ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాలు రావడం కష్టమేనని ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులతో కలిసి ఉద్యమంలో పాల్గొనేది. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్లు ప్రకటించింది. కానీ.. అది కార్యరూపం దాల్చకపోవడంతో మళ్లీ విద్యార్థులు ఉద్యమాలు మొదలుపెట్టారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ స్వరాష్ట్ర ప్రకటన చేయకపోవడంతో తెలంగాణ రాష్ట్రం రాదేమోనని ఆవేదన చెందింది. నా చావుతోనైనా తెలంగాణ రాష్ట్రం వస్తుందని భావించి 2014 ఫిబ్రవరి 2న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో ఆరు రోజులు చావుతో పోరాడి మృతిచెందింది. ఆ తర్వాత కొన్ని రోజులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ అమరవీరుల కుటుంబాలకు అండగా నిలిచారు. మా కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయంతోపాటు నా పెద్ద కూతురు స్వాతికి తాసీల్దార్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అమరుల కుటుంబాలనే కాకుండా ప్రతి పేదింటికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పెద్ద కొడుకులా అండగా నిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఆలస్యం చేయడం వల్లే నా బిడ్డతో సహా అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ కుటుంబాల్లో బిడ్డలు లేని లోటు ఏర్పడింది. మా దుఃఖానికి కారణం కాంగ్రెస్సే.

**– ఇట్టమల్ల శశికళ, లక్ష్మీదేవిగూడెం, వేములపల్లి మండలం**